క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి



కోనరావుపేటలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లారీలను పంపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం రాస్తారోకో చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్కార్ బాలాజీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా కోనరావుపేట వైజంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించారు. అకాల వర్షం వల్ల ధాన్యం తడిసి రైతన్నలు నష్టపోయే పరిస్థితి ఉంది కాబట్టి వెంటనే తూకం వేసి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోట్టె రామచంద్రం, మాజీ జెడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, మాజీ వైస్ ఎంపీపీ తీగల రవీందర్, నాయకులు బాపురెడ్డి, జిన్న అనిల్, బైరగోని సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డాటా ఎంట్రీ చేయండి

ముస్తాబాద్: ముస్తాబాద్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పది రోజుల క్రితం సేకరించిన ధాన్యానికి ఇప్పటివరకు డాటా ఎంట్రీ చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ఎలాంటి రికార్డులు నిర్వాహకులు తీసుకోలేదన్నారు. పది రోజుల క్రితం ధాన్యం తీసుకున్న అధికారులు.. వాటికి సంబంధించిన ట్రక్ షీట్లు కూడా ఇవ్వలేదని అన్నారు. తమ ఫోన్లకు ఎలాంటి ఓటీపీ ఇప్పటివరకు రాలేదన్నారు. కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకుని కేంద్రం నిర్వహణ సరిగా జరిగేలా చూడాలని కోరారు.

జడ్జిని కలిసిన సీఐలు



వేములవాడ: వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్‌ను వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులను ఎంపిక చేయండి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న శ్రీధర్

బోయినపల్లి: మండలంలో గ్రామసభల ద్వారా అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కోరుతూ సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ ఎంపీడీవో భీమ జయశీలకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అధికారులు సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని పేర్కొన్నారు. అవకతవకలు జరుగుతున్నాయని, అధికారులు దృష్టి సారించాలన్నారు.

ఇళ్ల భూముల హద్దులు చూపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

ఇల్లంతకుంట: దళితులకు 1978లో ఇందిరాగాంధీ ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల భూములకు హద్దులు చూపెట్టాలని పెద్దలింగాపురం గ్రామ అంబేడ్కర్ సంఘ సభ్యులు శుక్రవారం తహసీల్దార్ ఎంఏ ఫారుక్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. పసుల నరేశ్, పసుల వెంకటి, గన్నేరం నర్సయ్య, సంజిత్, లచ్చయ్య, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించండి

వేములవాడ: వేములవాడ మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్ల వెడల్పును 80 ఫీట్లతో చేపడుతున్న సందర్భంగా ఇళ్లు కోల్పోయే తమకు 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించి పనులు చేపట్టాలని పలువురు భూయజమానులు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నిరుద్యోగుల పాలిట శాపం.. సిబిల్ స్కోర్

వీర్నపల్లి: రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ తప్పనిసరి చేయడం కారణంగా అందని ద్రాక్షగా మారుతుందని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ అన్నారు. యువత తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కోరారు. నాయకుడు గజ్జెల భూమరాజు తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు



వరి కొయ్యలు కాల్చుతున్న రైతు

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేట, వంతడుపుల, వెల్జిపూర్, అనంతారం తదితర గ్రామాల్లో రైతులు వరి కోసిన కొయ్య కాళ్లను కాల్చివేస్తున్నారు. సాగు చేసే ముందు రైతులు వరి కొయ్యలను తగలబెడుతున్నారు. రైతులు తమ వరి పంట పొలాలను హార్వెస్టర్ల సహాయంతో కోస్తున్నారు. దాంతో వరి కొయ్య కాళ్లు పొడుగ్గా ఉండి దుక్కి దున్నడానికి అనువుగా లేవన్న కారణంతో వాటిని రైతులు ప్రతీ ఏటీ కాల్చివేస్తున్నారు. వ్యవసాయ కూలీలు కోసిన వరి పంట పొలాలు కొయ్య కాలు దిగువ భాగాన నుంచి కోయడంతో రైతులు నేరుగా దున్నేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. వరి కొయ్యలను కాల్చొద్దని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, చెబుతున్నా కూడా రైతుల్లో మార్పు రావడం లేదు. ప్రతి ఏటా కాలుస్తూనే ఉన్నారు.

సూక్ష్మజీవులు నశిస్తాయి



వరి కొయ్యలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నాలి. వరి దుబ్బలు తగలబెట్టడం వల్ల పర్యావరణానికి నష్టం. నేలలో ఉన్న ఉపయోగపడే సూక్ష్మజీవులు నశిస్తాయి. కొద్దిగా నీరు పెట్టి సింగిల్ సూపర్ ఫాస్ఫ్ ఎకరాన రెండు బస్తాలు చల్లి మురిగేలా చేయాలి.

– ఎం.సురేశ్‌రెడ్డి, వ్యవసాయ అధికారి



సిరిసిల్లటౌన్: కొత్త బస్టాండు వద్ద ప్లకార్డుల ప్రదర్శన



వేములవాడ: రాజన్న ఆలయం ఎదుట జర్నలిస్టుల నినాదాలు

భారత సైన్యానికి జేజేలు

సిరిసిల్లటౌన్: పాలిస్టర్ వార్పిన్ వర్కర్స్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం కొత్త బస్టాండ్ వద్ద భారత సైన్యానికి జేజేలు పలికారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహిస్తున్న భారత సైనికులకు కృతజ్ఞతలు చెబుతూ ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని అరికట్టాలన్నారు. సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, ఎలిగేటి రాజశేఖర్, ఐరన్ ప్రవీణ్, మచ్చ వేణు, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతిస్తూ వేములవాడ జర్నలిస్టులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి రాజన్న గుడి వరకు సాగిన ర్యాలీలో పాకిస్తాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రేగుల దేవేందర్, హింగే శ్రీనివాస్, పుట్టపాక లక్ష్మణ్, సూగూరి మహేశ్, బాబుయాదవ్, జనార్దన్, శ్రీనివాస్, ప్రవీణ్, మహేశ్, పర్శరాం, తిరుపతిరెడ్డి, రవి, దేవేందర్, సంపత్, ప్రశాంత్, శ్రీహరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూజలు

సిరిసిల్లకల్చరల్: వీర జవాన్లకు సంఘీభావంగా శుక్రవారం స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో పలువురు ప్రత్యేక పూజలు చేశారు.

అమర సైనికుడికి నివాళి



నివాళి అర్పిస్తున్న ఆగయ్య తదితరులు

ఎల్లారెడ్డిపేట: దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమర సైనికుడు మురళినాయక్‌కు త్యాగం గొప్పదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వీర జవాన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పిల్లి కిషన్, భీమేశ్, రాజు నాయక్, నర్సింలు, రాజిరెడ్డి, సుధాకర్‌రావు, సీత్యానాయక్, రాము, కల్యాణ్, బంటి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లకల్చరల్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మరణించిన జవాన్లకు జిల్లా న్యాయవాదుల సంఘం శుక్రవారం సాయంత్రం నివాళి అర్పించింది. మురళినాయక్ అనే జవాన్ యుద్ధంలో మరణించడం బాధాకరమని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: మురళినాయక్‌కు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, కుంభాల మల్లారెడ్డి, దిడ్డి రాజు, కల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మురళినాయక్‌కు పలువురు నివాళి అర్పించారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం



వేములవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

వేములవాడ: పత్రికా స్వేచ్ఛను హరిస్తే జర్నలిస్టులు ఊరుకోబోరని వేములవాడ జర్నలిస్టులు ఏపీ పోలీసులను హెచ్చరించారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై అక్రమ దాడులను నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు రేగుల దేవేందర్, హింగే శ్రీనివాస్, బాబూయాదవ్, పుట్టపాక లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఏపీ పోలీసులు తమ విధానాలను మార్చుకోకుంటే జర్నలిస్టు సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఇల్లంతకుంట: సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు చొరబడి సోదాలు చేయడం పత్రిక స్వేచ్ఛను హరించడమేనని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్ అన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం



బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

తంగళ్లపల్లి: జిల్లెల్ల గ్రామ శివారులోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల మూడో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం మాట్లాడుతూ.. రైతులు దేశాన్ని పోషిస్తున్నారని, విద్యార్థులు గురువులను గౌరవించాలని, మానసిక దృఢత్వంతో ముందుకు సాగాలని సూచించారు. తన వ్యవసాయ విద్య అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరించి వివిధ ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రామయ్యపేట రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ దేవ్‌రావు, సైనోవిట ఫార్మర్ సొల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ రెడ్డి, కళాశాల అసోసియేట్ డీన్ కె.బి.సునీతాదేవి, ప్రొఫెసర్లు భవ్యశ్రీ, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



బద్దెనపల్లిలో చెక్కులు అందిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: బద్దెనపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, అభినయ్‌గౌడ్, ఎల్లయ్య, సత్యనారాయణ, అంజయ్య, హోలియుద్దీన్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గుపల్లిలో బడిబాట



బోయినపల్లి: బూర్గుపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

పుస్తె మెట్టెలు అందజేత



ఇల్లంతకుంట: తిప్పాపురం గ్రామానికి చెందిన పాడి రైతు ఏగుర్ల ఐలయ్య కూతురు వివాహానికి శుక్రవారం కరీంనగర్ డెయిరీ కల్యాణమస్తు పథకం కింద పుస్తె మెట్టెలు అందజేశారు. అవారు మల్లయ్య, చిట్టి వెంకట్రామ్‌రెడ్డి, గుర్రం సతీశ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడపం



పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వీరప్రసాద్, ఎస్సై రాజు

వేములవాడ: మద్యం తాగి వాహనాలు నడపమని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులు పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ప్రమాణం చేశారు. టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్సై రాజు వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.



పోచమ్మ బోనాలు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ముదిరాజులు శుక్రవారం రాత్రి పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో అమ్మవారు వద్దకు బయలుదేరగా.. శివసత్తులు, బైండ్లవాళ్ల ప్రదర్శనలతో ఆడుతూపాడుతూ ఆనందోత్సాహాల మధ్య బోనాలు జరిపారు. గుడి వద్దకు వెళ్లి పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ జాతర నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి పోచమ్మ బోనాలు తీశారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రశాంత్

సిరిసిల్లటౌన్: జిల్లాలో అనుమతి లేని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కల్యాణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సాయిభరత్, శివ, శ్రీధర్, రాబిన్సన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: తహసీల్ కార్యాలయాన్ని గుర్తించేందుకు కొత్తగా కార్యాలయానికి వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయానికి బోర్డును ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేయగా.. అది కాస్తా చిరిగిపోయి పేరు కనబడకుండా పోయింది. కార్యాలయ బోర్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో కొత్తగా వెళ్లేవారు కార్యాలయాన్ని గుర్తించలేకపోతున్నారు. అందరికి కనిపించేలా కార్యాలయానికి నూతన బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు



చికిత్స పొందుతున్న కొమురయ్య

తంగళ్లపల్లి: అంకుషాపూర్ గ్రామానికి చెందిన జీల కొమురయ్య అనే రైతుకు శుక్రవారం ప్రాణాపాయం తప్పి తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఉదయం 11 గంటల సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ కొట్టేసింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతు కొమురయ్య ఆఫ్ చేసి ఫ్యూజ్ వైర్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రుడిని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ పరామర్శించారు. తంగళ్లపల్లి సెస్ ఏఈ మధుకర్‌ను సాక్షి వివరణ కోరగా.. రైతులు నేరుగా విద్యుత్ మరమ్మతు చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

ఉపాధిహామీ గ్రామసభలు



ఉపాధి పనులు వివరిస్తున్న అధికారి

వీర్నపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండల కేంద్రంతోపాటు కంచర్ల, భూఖ్యతండా, బాబాయిచెరువు తండా, బావుసింగ్‌నాయక్‌తండా, సీతారాంనాయక్ తండా, ఎర్రగడ్డతండా, రంగంపేట, జవహర్‌నాయక్‌తండా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఉపాధిహామీ గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు జరిగిన పనుల రికార్డులను పరిశీలించి గ్రామసభల్లో సామాజిక తనిఖీ చదివి వినిపించారు. మస్టర్లలో తప్పులు వేయడం, పనికి రాకున్నా కూలీలకు హాజరు వేసినట్లు గుర్తించారు. నివేదికలు ఈనెల 13న సామాజిక తనిఖీలో చర్చిస్తామన్నారు. ఎస్‌ఆర్పీ బాలునాయక్, డీఆర్పీ రవి, ఏపీవో శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కవి సమ్మేళనంలో జిల్లా కవులు



దేవానందంను సత్కరిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ గజల్ కవి, మానేరు రచయితల సంఘం ప్రతినిధి బూర దేవానందం, తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అంకారపు రవి జాతీయ కవి సమ్మేళనానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు హాజరయ్యారు. హైదరాబాద్ త్యాగరాజ గాన సభలో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన జాతీయస్థాయి కవి సమ్మేళనంలో కవితా గానం చేశారు. తెలుగు భాష ఔన్నత్యం, వైశిష్ట్యంపై గానం చేసిన కవిత ఆహూతులను అలరించింది. కవులు దేవానందం, రవిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించి అభినందించారు. రవి యువ పురస్కారం అందుకున్నారు.

నైపుణ్యాలు పదును పెట్టేందుకే సమ్మర్ క్యాంపులు



ఎల్లారెడ్డిపేటలో విద్యార్థుల యోగాసనాలు

ఎల్లారెడ్డిపేట: వేసవి సెలవుల్లో విద్యార్థులను మరింత నిష్ణాతులుగా తయారు చేస్తూ వారి మెదడుకు పదును పెట్టేందుకు సమ్మర్ క్యాంపులు ఉపయోగపడతాయని మండల విద్యాధికారి కృష్ణహరి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు మనోహరచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

బోయినపల్లి: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వరదవెల్లి హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఎం.లక్ష్మి, వి.పూజితను సన్మానించి మెమెంటోలు అందించారు. హెడ్ మాస్టర్ మాద రాములు, ఉపాధ్యాయులు మోయిన్ అహ్మద్, మల్లయ్య, ఏఏపీసీ చైర్మన్ వజ్రమ్మ పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్‌కు టెండర్ వేస్తాం

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ద్విచక్ర వాహనాలు, సైకిల్ స్టాండ్‌కు వెంటనే టెండర్ వేస్తామని డిపో మేనేజర్ కిషన్‌రావు శుక్రవారం తెలిపారు. సాక్షి దినపత్రికలో శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో వాహనాల పార్కింగ్ అని వచ్చిన కథనానికి డీఎం స్పందించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోయినపల్లి: నర్సింగాపూర్ హైస్కూల్‌లో 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గతంలో పాఠాలు చెప్పిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు.